సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

సిరిసిల్ల: సిరిసిల్లలో వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందాలు యుతిక, సాయిశ్రీ ఫిజియోథెరపీ సెంటర్లు, సృజన్‌సాయి ల్యాబ్‌లను పరిశీలించాయి.



కొవ్వొత్తుల నివాళి

సిరిసిల్లఅర్బన్: మెడికల్ విద్యార్థిని ప్రీతి, స్నేహితుడి చేతిలో హత్యకు గురైన నవీన్ మృతిపై సోమవారం సిరిసిల్లలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. తెల్లవారుజామున ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాలసాహిత్యంతో నైతిక విలువల పెంపు



మాట్లాడుతున్న రామకృష్ణ

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థుల్లో సామాజిక, నైతిక విలువలు పెంపొందించేందుకు బాలసాహిత్యం దోహదపడుతుందని కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ, మానేరు రచయితల సంఘం, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కేజీ టు పీజీ క్యాంపస్‌లో తెలంగాణలో బాలసాహిత్య వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ హాజరై మాట్లాడారు. బాలసాహిత్య అధ్యయనంపై విద్యార్థుల్లో మనోవికాసం పెంపొందుతుందన్నారు. బాలసాహితీవేత్తలు కందేపి రాణీప్రసాద్, బీఎస్ స్వామి, గరిపల్లి అశోక్, వాసరవేణి పర్శరాములు, కళాశాల ప్రిన్సిపాల్ పిట్ల దాసు, మానేరు రచయితల సంఘం ప్రతినిధులు పత్తిపాక మోహన్, రవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవల్లి, ఉమారాణి, కృష్ణమూర్తి, భిక్షమయ్య, ఆంజనేయులు, ధర్మపురి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి మోడల్‌స్కూల్ టీచర్



బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు బోయినపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు మహేశుని రామకృష్ణ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి రామకృష్ణ ఎంపికవడంపై జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన రెండు గ్రామాల ప్రజలు



ఎమ్మెల్యేతో తడగొండ గ్రామస్తులు

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని తడగొండ, రత్నంపేట గ్రామాలకు చెందిన పలువురు సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. తడగొండలో మార్చి 8న నిర్వహించే బీరప్ప పట్నాలకు హాజరుకావాలని కుర్మసంఘం నాయకులు ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావును కలిసి ఆహ్వానించారు. రత్నంపేటకు చెందిన పలువురు ఆరె క్షత్రియ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ చిందం రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ గుడి శ్రీనివాసరెడ్డి, కుర్మసంఘం అధ్యక్షుడు దయ్యాల కొమురయ్య, నాయకులు రంగి తిరుపతి, గురిజాల కోటి, బుర్ర రాజు, చేపూరి కనకయ్య, బత్తిని కమల్ ఉన్నారు.

ఈఎస్ఐ నిర్మాణంలో నిర్లక్ష్యం



సిరిసిల్లటౌన్: జిల్లాలో ఈఎస్ఐ నిర్మాణంపై సర్కారు అంతులేని నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా నిరుపేదలు, కార్మికవర్గాలు ఉన్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఆస్పత్రి నిర్మాణంపై ఎంపీ బండి సంజయ్ పట్టించుకోవడం లేదన్నారు. నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందజేయాలని కోరారు. వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో గంగయ్యకు అందించారు. ఎరవెల్లి నాగరాజు, కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, మల్లారపు ప్రశాంత్, ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాసు పాల్గొన్నారు.

కంటివెలుగులో 3,883 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగులో సోమవారం 3,883 మందికి పరీక్షలు చేశారు. 571 మందికి రీడింగ్ అద్దాలను, 495 మందికి పాయింట్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,04,563 మందికి కంటివెలుగులో పరీక్షలు నిర్వహించారు. 225 మంది సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు అద్దె ఇళ్లే దిక్కు !



- ఈ చిత్రంలో భార్య, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో ఉంటున్న వ్యక్తి పేరు మహ్మద్ అక్తర్. ముస్తాబాద్ మండల కేంద్రం. అక్తర్ కూలీ పనులు చేస్తుంటాడు. భార్య ఫర్జాన బీడీలు చుడుతోంది. అక్తర్ తండ్రి రెవెన్యూలో స్వీపర్‌గా పనిచేశాడు. నాలుగేళ్లకోసారి వీఏవోగా అక్తర్‌కు వచ్చే వారసత్వం పని ఉందని.. అధికారులు డబుల్‌బెడ్‌రూమ్ నిరాకరించారు. గుంటెడు జాగ, సొంతిల్లు లేదు. నెలకు రూ.వెయ్యి చెల్లిస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నారు. తండ్రి మరో చోట అద్దె ఇంట్లో కాలం వెళ్లదీస్తున్నాడు. ముస్తాబాద్‌లోనే పుట్టి పెరిగిన అక్తర్‌కు అద్దె ఇల్లే దిక్కయ్యింది. ఇతర గ్రామాలు, జిల్లాల నుంచి వచ్చిన ఎంతో మందికి కేసీఆర్ కాలనీలో ఇళ్లు దక్కాయని అక్తర్ ఆవేశాన్ని వెళ్లగక్కుతున్నాడు.



ముస్తాబాద్‌లో కేసీఆర్ కాలనీ

- ఈ ఫొటోలో కనిపిస్తున్న అవ్వ పేరు సారుగు విజయ. మనుమడు శ్రీకాంత్‌తో కలిసి అద్దె ఇంట్లో కాలం వెళ్లదీస్తుంది. విజయ భర్త బుచ్చయ్య అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం మృతిచెందాడు. సంతానం లేని విజయ.. వరసకు మనుమడు అయ్యే చిన్నారి ప్రశాంత్‌తో నెలకు రూ.వెయ్యి చెల్లిస్తూ అద్దె ఇంట్లో జీవిస్తోంది. ఇటీవల విజయ పక్షవాతానికి గురైంది. ప్రతీ నెల వచ్చే ఆసరా పెన్షన్‌లో కిరాయికి రూ.వెయ్యి పోను.. మిగతా రూ.వెయ్యితో నెలంతా బతుకీడుస్తోంది. భర్త బుచ్చయ్య అనారోగ్యానికి గురైతే ఉన్న ఒక్కగానొక్క పెంకుటిల్లును అమ్మి వైద్యం చేయించింది.



అయితే ఒంటరి మహిళా అని ఆమెకు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ముస్తాబాద్‌లో విజయ మాదిరిగా ఒంటరి మహిళలు ఇరువై మంది వరకు ఉంటారు.

> **ఉండని వారి ఇళ్లు స్వాధీనం చేసుకుంటాం**
>
> నిజమైన పేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇచ్చింది. కేసీఆర్‌కాలనీలో కొందరి ఇళ్లపై ఫిర్యాదులు అందాయి. వాటిపై విచారణ చేసి, తాళాలు ఉన్న ఇళ్లకు నోటీసులు అంటించాం. అనర్హులు అని తేలితే వారి ఇళ్లను స్వాధీనం చేసుకుని అర్హులకు అందిస్తాం. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గం.
>
> – మునీందర్, తహసీల్దార్

- 'డబుల్' ఇళ్లకు తాళాలు
- కొరడా ఝుళిపిస్తున్న అధికారులు
- ముస్తాబాద్‌లో 17 మంది లబ్ధిదారులకు నోటీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యానికి క్షేత్రస్థాయిలో కొందరు తూట్లు పొడుస్తున్నారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో అర్హులకు న్యాయం జరగడం లేదు. ముస్తాబాద్ కేసీఆర్‌కాలనీలో నిర్మించిన 'డబుల్' ఇళ్లలో చాలామటుకు అనర్హులకు దక్కాయని తెలుస్తోంది. ఇటీవల అధికారులు చేపట్టిన సర్వేలో ఈ విషయం నిర్ధారణ అయ్యింది.

సరిగ్గా ఏడాది క్రితం..

ముస్తాబాద్‌లో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కోసం 544 మంది దరఖాస్తు చేసుకున్నారు. 154 ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు రెవెన్యూ అధికారులు ఆపసోపాలు పడ్డారు. చివరికి మంత్రి కేటీఆర్ జోక్యంతో ఏడాది క్రితం అర్హులను ఎంపికచేశారు. అధికార పార్టీకి చెందిన వారి ఒత్తిళ్లతో ఇరువై నుంచి ఇరవై అయిదు ఇళ్లకు పట్టాలు ఇవ్వాల్సి వచ్చిందని రెవెన్యూశాఖ అధికారులే అప్పుడు వాపోయారు. ఇళ్లు, పొలాలు ఉన్న వారే ఇళ్లు పొందారనే ఆరోపణలు అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. చివరికి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ పూర్తి చేశారు. మంత్రి చేతుల మీదుగా తాళాలు పొందిన కొందరు ఇప్పటికీ ఆయా ఇళ్లల్లో ఉండకపోవడం, చివరికి ఇళ్లు రాని నిజమైన అర్హులు ఒత్తిడి ప్రజాప్రతినిధులపై పెరిగింది. ఎంపీపీ శరత్‌రావు, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు సర్వే చేసి అర్హుల నిగ్గు తేల్చాలని మండల సర్వ సభ్య సమావేశంలో అధికారులను కోరారు. సర్వే చేసిన రెవెన్యూ అధికారులు తాళాలు ఉన్న ఇళ్లకు మళ్లీ తాళాలు వేసి.. 17 మందికి నోటీసులు జారీ చేశారు. ఇళ్లు పొందిన వారు ఎక్కడుంటున్నారో తేల్చాలని, ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారెందరో తెలుసుకునే పనిలో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమైంది.

అధికారుల అవాక్కు

- ముస్తాబాద్ కేసీఆర్‌నగర్‌లో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లల్లో పది మంది వరకు ఇప్పటి వరకు తాళాలే తీయలేదని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.
- కొందరు వారాంతపు రోజుల్లో విందులకు వినియోగించుకుంటున్నారని తెలిసి అధికారులు అవాక్కయ్యారు.
- ఇటీవల రెండు ఇళ్లను అమ్మకానికి పెట్టారని, మరో రెండు ఇళ్లను అద్దెకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని అధికారుల సర్వేలో తెలిసింది.
- సిద్దిపేట, సిరిసిల్ల పట్టణాల్లో నివసించే వారికి 'డబుల్' అక్కడ, ఇక్కడ దక్కినట్లు తెలిసింది.
- నిజమైన అర్హులను గుర్తించి మరోసారి 17 మంది లబ్ధిదారులను తేలుస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నేడు జిల్లాకు మంత్రి కేటీఆర్ రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తోట ఆగయ్య తదితరులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మంగళవారం మంత్రి కేటీఆర్ రానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట జూనియర్ కాలేజీ మైదానంలో సభాస్థలిలో ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం పరిశీలించారు. ఇప్పటికే ఒక వృద్ధుడు ఆశ్రమంలో చేరినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఇలా..

- ఉదయం 11 గంటలకు ముస్తాబాద్ మండలం మోహినికుంటలో కల్వకుంట్ల చక్రధర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.
- ఉదయం 11.30 గంటలకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు.
- మధ్యాహ్నం 12.30 గంటలకు ఎల్లారెడ్డిపేటలోని వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు రాచర్లగొల్లపల్లిలో ఎల్లమ్మ సిద్ధోగానికి హాజరవుతారు.
- మధ్యాహ్నం 2 గంటలకు రాచర్లబొప్పాపూర్‌లో గ్రామపంచాయతీ భవనం, 2.30 గంటలకు రాగట్లపల్లిలో గ్రామపంచాయతీ భవనం, 3 గంటలకు వెంకటాపూర్ గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభిస్తారు.
- సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లో సిరిసిల్ల పట్టణంలోని లబ్ధిదారులకు డబుల్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు.



రాజన్నకు జనజాతర

వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పొలాలు ఎండిపోతున్నాయ్..



కాల్వ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సార్.. పొలాలు ఎండిపోతున్నాయి.. మానేరు కెనాల్‌కు నీళ్లు వత్తలేవు. పంటలు పండుతాయన్న గ్యారంటీ లేదు.. అసలు నీళ్లు వస్తయా.. రావా.. చెప్పండంటూ పోతుగల్, గన్నెవారిపల్లె రైతులు అధికారులకు ప్రజావాణిలో మొర పెట్టుకున్నారు. వారు మాట్లాడుతూ మానేరు ప్రాజెక్టు కెనాల్ చివరి ఆయకట్టు పొలాలకు నీరు వారం రోజులుగా రావడం లేదన్నారు. సర్పంచ్ గౌతంరావు మాట్లాడుతూ నీటిపారుదలశాఖ అధికారులు కాల్వను సందర్శించి నీరు వచ్చేలా చూడాలని కోరారు. మల్లన్నసాగర్ నీటిని ముస్తాబాద్ పెద్ద చెరువుకు తరలించాలని, అక్కడి నుంచి నీటిని విడుదల చేస్తే పోతుగల్, గన్నెవారిపల్లె, సేవాలాల్‌తండా, తెర్లుమద్ది రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పొలాలు ఎండుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ విమర్శించారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మానేరు కెనాల్ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు.

ఒంటరి పురుషులే లక్ష్యం

- ఎరగా యువతులు
- లక్షల్లో వసూలు !
- ఒకే మహిళకు ముగ్గురితో వివాహం
- మరో యువతి పెళ్లి చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న బాధితుడు
- పోలీసుల అదుపులో యువతులను సరఫరా చేసిన వ్యక్తి
- విచారణ చేపట్టిన వేములవాడ పోలీసులు







లక్ష్మణ్ పెళ్లి ఫొటో, శివకుమార్, పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు లక్ష్మణ్, మరో పెళ్లికి సిద్ధమైన కుటుంబం

వేములవాడ: తోడు కోసం ఎదురుచూస్తున్న పురుషులు.. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న ఆడపిల్లల కుటుంబాలే లక్ష్యంగా కర్ణాటకకు చెందిన శివకుమార్ యువతుల దందా నడిపాడు. పేద యువతులతో పెళ్లిళ్లు చేయిస్తూ ఒక్కొక్కరి నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. ఒకే యువతికి మూడు పెళ్లిళ్లు చేయడం గమనార్హం. అంతేకాకుండా పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లాక.. అక్కడి నుంచి ఎలా తప్పించుకోవాలో కూడా శిక్షణ ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఓ యువతికి గతంలో ఇద్దరితో పెళ్లిళ్లు చేసిన సదరు వ్యక్తి వేములవాడలో సోమవారం మరొకరితో పెళ్లి చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బాధితులు తెలిపిన వివరాలు. నిజామాబాద్ జిల్లా తాటిపల్లికి చెందిన లక్ష్మణ్ భార్య కొన్నాళ్ల క్రితం చనిపోయింది. లక్ష్మణ్‌కు కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గా ప్రాంతానికి చెందిన శివకుమార్ పరిచయమయ్యాడు. పేద కుటుంబానికి చెందిన మహిళతో పెళ్లి చేస్తానని లక్ష్మణ్‌ను ఒప్పించి కర్ణాటకలోని బోనాపూర్ తీసుకెళ్లాడు. అక్కడే సరిత(35)ను చూపించి.. రూ.3లక్షలు ఇస్తే ఆమెతో పెళ్లి చేయిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. రూ.2 లక్షల నగదు, రూ.లక్ష ఫోన్‌పే చేయించుకున్నాడు. జూలై 17, 2022న అదే ప్రాంతంలోని కుమ్మవారి ఆలయంలో అక్కడి సాంప్రదాయ ప్రకారం లక్ష్మణ్, సరితలకు వివాహమైంది. అక్కడి నుంచి తాటిపెల్లికి తీసుకొచ్చారు. రెండు రోజుల తర్వాత కర్ణాటక సాంప్రదాయం ప్రకారం పెళ్లి కూతురు తల్లిగారింట్లో నిద్రచేయాలని నమ్మించారు. ఈక్రమంలో కర్ణాటకకు వెళ్లేందుకు లక్ష్మణ్–సరితలు హైదరాబాద్‌కు బయలుదేరారు. సికింద్రాబాద్ స్టేషన్ వద్ద రద్దీలో సరిత తప్పించుకొంది. వెంటనే శివకుమార్‌కు ఫోన్ చేస్తే పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. అప్పటి నుంచి శివకుమార్ కోసం గాలిస్తూనే ఉన్నారు. ఈక్రమంలో శివకుమార్ పెగడపల్లి మండలం నంచర్ల రాములపల్లికి చెందిన గాజ రాజుకు కర్ణాటకలోని చించోలికి చెందిన మోహన్ కుమార్తెతో పెళ్లి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు లక్ష్మణ్‌కు తెలిసింది. బంధువుల సాయంతో వేములవాడకు చేరుకొని గాలించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.

ఒకే యువతికి ముగ్గురితో పెళ్లి

కర్ణాటకకు చెందిన సరితకు ఏకంగా ముగ్గురితో పెళ్లి జరిపించాడు శివకుమార్. మలిదశలో తోడు కోసం ఎదురుచూస్తున్న పురుషులే లక్ష్యంగా ఈ పెళ్లిళ్లు చేశాడు. ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ముందుగా తాటిపెల్లికి చెందిన లక్ష్మణ్, తర్వాత కోరుట్ల ప్రాంతానికి చెందిన భాస్కర్‌రెడ్డి, మూడోసారి అదే ప్రాంతానికి చెందిన రాజిరెడ్డిలతో పెళ్లిళ్లు జరిపించాడు. పెళ్లి చేసుకోవడం .. తర్వాత అక్కడి నుంచి తప్పించుకునేలా శిక్షణ ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఠాణాలో బాధిత కుటుంబాలు

కర్ణాటకకు చెందిన పేద యువతులను తెలంగాణ ప్రాంతంలోని వృద్ధులతో పెళ్లిళ్లు చేస్తూ పబ్బం గడుపుకుంటున్న వైనం వెలుగుచూపడంతో సోమవారం రాత్రి వేములవాడ ఠాణాకు బాధిత కుటుంబాలు చేరుకున్నాయి. సరితను వివాహమాడిన లక్ష్మణ్, పెగడపల్లి ప్రాంతానికి చెందిన రాజు, కర్ణాటకలోని చించోలికి చెందిన మోహన్ కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారు.

మలిసంధ్యలో మనోవికాసం

- ఎల్లారెడ్డిపేటలో వృద్ధుల సంరక్షణ కేంద్రం
- రాష్ట్రంలో తొలి కేంద్రం
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నేడు ప్రారంభోత్సవం



వృద్ధుల సంరక్షణ కేంద్రం గోడపై గాంధీజీ చిత్రం



వృద్ధుల సంరక్షణ కేంద్రంలోని బెడ్స్

సిరిసిల్ల: కన్న కొడుకులు, బిడ్డల ఆదరణకు దూరమైన వృద్ధులు.. ఏ ఆధారం లేని పండుటాకులు.. నిలువనీడ లేక.. అసహాయ స్థితిలో దిక్కులు చూసే వయోవృద్ధులకు ఆశ్రయం కల్పించే లక్ష్యంతో రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వం వృద్ధుల కోసం సంరక్షణ కేంద్రాన్ని ఎల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేసింది. రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు ఆలోచనతో ఈ కేంద్రం ఏర్పాటైంది. మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించనున్నారు.

ఆత్మగౌరవ కేంద్రంగా..

పిల్లలను కంటికి రెప్పలా పెంచి.. పెద్ద చేసి.. చదువులు చెప్పించి.. పెళ్లిళ్లు చేసి.. చివరికి మలిసంధ్యలో ఆదరణకు నోచుకోలేక నిలువనీడ లేని వృద్ధులు ఆత్మగౌరవంతో బతికేందుకు ఎల్లారెడ్డిపేటలోని వృద్ధుల సంరక్షణ కేంద్రం వేదికవుతుంది. కొడుకులు పోషించడం లేదని, వైద్యం చేయించడం లేదని కుమిలిపోయే వృద్ధులకు ఇది మనోవికాస కేంద్రంగా మారనుంది. ఎల్లారెడ్డిపేటలోని ఎస్టీ వసతి గృహాన్ని రూ.40 లక్షలతో ఆధునికీకరించి వృద్ధుల సంరక్షణకేంద్రంగా మార్చారు.

మనోవికాస కేంద్రంగా..

మలిసంధ్యలో ఒంటరి అనే భావన కలుగకుండా.. మానసికోల్లాసం కలిగేలా ఏర్పాట్లు చేశారు. ధ్యానం చేయడం, పుస్తకాలు చదవడం, చెస్, వైకుంఠపాళి, క్యారంబోర్డు వంటి ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. అందరూ ఒక్కచోట కూర్చుని మాట్లాడుకునేందుకు ఒక వేదికను నిర్మించారు. వ్యాయామం చేసేందుకు అవసరమైన సాధనాలు, ఫిజియోథెరపీ పరికరాలను అందుబాటులో ఉంచారు. ప్రత్యేకంగా స్నానపు గదులు, మరుగుదొడ్లను నిర్మించారు. భవన ఆవరణలో రంగురంగుల పూలమొక్కలు నాటారు. భవనం గోడలపై అందమైన చిత్రాలను వేయించారు. మహాత్మాగాంధీ చిత్రం ఆకట్టుకుంటోంది. మరోవైపు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక వైద్యుడు, వృద్ధుల సంరక్షకుడిని నియమించారు. తొలిదశలో 20 పడకలు ఏర్పాటు చేశారు. అన్ని పడకలకూ దోమతెరలను ఉంచారు.

మండలానికో కేంద్రం లక్ష్యం

మంత్రి కేటీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఎల్లారెడ్డిపేటలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలానికి ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్‌జీవోల సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ కేంద్రాలను నిర్వహించాలని భావిస్తున్నారు. శిశుసంక్షేమం, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో అన్ని మండలాల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

> **బహుముఖ ప్రయోజనాలు**
>
> 
>
> సంరక్షణ కేంద్రంలో వృద్ధులు కాలక్షేపం చేసేందుకు ఉపయోపడుతుంది. జీవిత చరమాంకంలో ఉల్లాసంగా గడిపేందుకు, ఒకరితో ఒకరు యోగక్షేమాలు పంచుకోవడానికి సంరక్షణ కేంద్రం వేదికగా నిలువనుంది. ఏ ఆధారం లేని వాళ్లు ఉండేందుకు వీలుగా ఆధునిక వసతులు కల్పించాం. మంత్రి కేటీఆర్ మార్గదర్శనంతో బహుముఖ ప్రయోజనాలు లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం.
>
> – అనురాగ్ జయంతి, కలెక్టర్

క్లుప్తంగా

వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న బీసీ విద్యార్థి నాయకులు

సిరిసిల్లఅర్బన్: వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతికి బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవి మాట్లాడుతూ.. కళాశాలలో సీనియర్ల వేధింపులు తాళలేకనే ఆమె ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, బాధితురాలి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇల్లందుల ప్రకాశ్, రుద్రవేణి సుజిత్, రమ్య, దీక్ష, శ్రీజ, అవనిక, సాహితి, నందిని, మానస, శృతి, గౌతమి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



ప్రదర్శనలతో విద్యార్థినులు

సిరిసిల్లటౌన్: సైన్స్ డే సందర్భంగా సోమవారం నిర్వహించిన సిరిసిల్ల విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. విద్యార్థులు మెదడుకు పదును పెట్టి, సేవ్ ఎర్త్, ఆర్గానిక్ ఫామింగ్, లేజర్ లైటింగ్ తదితర పరికరాలను తయారు చేసి, ప్రదర్శించారు. కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, ఆకుల కృష్ణ, వేముల రవి, రెడ్యానాయక్, గుండ్లపల్లి రామానుజం, వెల్దండి దేవదాసు, గడ్డం లత, కరస్పాండెంట్ బొడ్డులు సుదర్శన్, ప్రిన్సిపాల్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశపరీక్షకు అర్హులని పేర్కొన్నారు. మార్చి 6 లోపు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నిరుపేదలకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాములు

వేములవాడఅర్బన్: నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ మండలంలోని చంద్రగిరి పంచాయతీ పరిధిలోని తుర్కాశీ కాలనీలో సోమవారం ఆయన మాట్లాడారు. నిరుపేదలైన ఈ కాలనీవాసులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించాలని, వాటిలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని కోరారు. పూరి గుడిసెల్లో ఉంటూ వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

'ఆయుష్'లో యోగా కేంద్రాలు

- జిల్లాలోని 8 ఆస్పత్రుల్లో ఏర్పాటుకు నిర్ణయం
- ఒక్కోదానికి రూ.6 లక్షలు మంజూరు



వేములవాడలో పనులు పూర్తయిన యోగా కేంద్రం

కోనరావుపేట(వేములవాడ): ఈ రోజుల్లో చాలామందికి మానసిక ఒత్తిడి ఎక్కువై, ప్రశాంతత కరువవుతోంది. దీంతో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతోపాటు పలు రకాల మానసిక వ్యాధులబారిన పడుతున్నారు. అటువంటి వారి జబ్బులను యోగా ద్వారా నియంత్రించే అవకాశం ఉంది. యోగాతో పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండటంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్న విషయాన్ని గుర్తించిన ఆయుష్ విభాగం అన్ని ఆయుష్ ఆస్పత్రుల్లో యోగా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

ఆయుష్ ఆస్పత్రుల్లో ఆయుర్వేదం, యోగా, ప్రకృతి చికిత్స, యునాని, సిద్ధ, హోమియోపతి ద్వారా చికిత్స అందిస్తారు. వీటిలో యోగా ద్వారా ఎలాంటి మందులు వాడకుండా పలు రకాల వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చు. ఆహార, జల, సూర్యకిరణ, యోగా, మర్దన, ఉపవాస, మృత్తికా, వాయు చికిత్సలు మనసును స్వస్థపరిచి, ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడతాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న యోగా రోగ నివారణ కోసం కృషి చేస్తుంది.

నాలుగు చోట్ల పనులు పూర్తి..

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, బోయినపల్లిల్లో గల ఆయుష్ ఆస్పత్రుల్లో జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా యోగా కేంద్రాలను మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున కేటాయించారు. వీటిలో సిరిసిల్ల, వేములవాడ, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేటల్లో సెంటర్ల నిర్మాణ పనులు పూర్తవగా మిగతాచోట్ల నిర్మాణంలో ఉన్నాయి.

ఒక్కో సెంటర్‌కు ఇద్దరు శిక్షకులు..

ప్రస్తుతం పలు రకాల ఆహారపు అలవాట్లతో పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా ప్రజలు అనారోగ్యం, పలు రకాల వ్యాధులకు గురవుతున్నారు. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా నిర్మించే కేంద్రాలు 18 ఫీట్ల వెడల్పు, 21 ఫీట్ల పొడవు ఉండేలా రూపకల్పన చేశారు. ఒక్కో కేంద్రానికి ఇద్దరు యోగా శిక్షకులను నియమిస్తున్నారు.

మానసిక ప్రశాంతత ముఖ్యం



ప్రజలకు మానసిక ఒత్తిడి పెరిగి, ఆహార అలవాట్లు మారడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. వ్యాధులను నియంత్రించాలంటే మానసిక ప్రశాంతత ముఖ్యం. ప్రతీరోజు యోగా చేయడం వల్ల మానసిక ఆరోగ్యం బాగుంటుంది. జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రుల్లో యోగా కేంద్రాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

– రవినాయక్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, వరంగల్

అవగాహన కల్పిస్తాం..



ఆయుష్ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసే యోగా కేంద్రాల్లో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, యువతకు యోగాపై అవగాహన కల్పిస్తాం. గర్భిణులతో పలు రకాల యోగాసనాలు చేయించడం వల్ల సుఖ ప్రసవం అయ్యే అవకాశం ఉంటుంది. కేంద్రాల ఆవరణలో హెర్బల్ ప్లాంటేషన్ ఏర్పాటు చేసి, ఔషధ మొక్కలు పెంచుతాం.

– డాక్టర్ నీరజ, జిల్లా నోడల్ అధికారి, ఆయుష్ విభాగం

ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించడంలో రిసెప్షన్ అధికారులు చురుగ్గా వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లాలోని అన్ని ఠాణాల రిసెప్షన్ అధికారులకు శిక్షణనిచ్చారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఎస్‌హెచ్‌వోల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పరిష్కారానికి సంబంధిత రెండు రకాల ధ్రువీకరణాలతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమర్థమైన సేవలందించే వివిధ విభాగాల అధికారులకు ప్రతి నెలా రివార్డులు అందజేస్తామని తెలిపారు. ఏఎస్పీ చంద్రయ్య, సీఐ అనిల్‌కుమార్, రిసెప్షన్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ/వేములవాడఅర్బన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. 'ప్రజాగోస.. బీజేపీ భరోసా'లో భాగంగా సోమవారం పట్టణంలోని మహాలక్ష్మీవీధిలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. గత ఎనిమిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరిస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, నాయకులు రేగుల మల్లికార్జున్, అల్లాడి రమేశ్, రేగుల సంతోష్‌బాబు, అన్నారం శ్రీనివాస్, రామతీర్థపు హరీశ్, పిన్నింటి హన్మండ్లు, బిళ్ల కృష్ణ, గుడిసె మనోజ్, గొట్టం నరేశ్, కనకయ్య, రాహుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి

కేంద్రం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. వేములవాడ మండలం కొడుముంజలో 'ప్రజాగోస.. బీజేపీ భరోసా'లో భాగంగా మాట్లాడారు. ముంపు గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, రేగుల మల్లికార్జున్ ఉన్నారు.

మర్రిగడ్డ స్కూల్‌లో ఎంఈవో విచారణ



పాఠశాలలో విచారణ జరుపుతున్న ఎంఈవో, సర్పంచ్, హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు సోమవారం విచారణ చేపట్టారు. ఈ స్కూల్‌లో 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు టీచర్లు ఉండగా.. ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులకు మధ్య విభేదాలు తలెత్తడంతో డిసెంబర్‌లో ఒక టీచర్ డిప్యూటేషన్‌పై మూడపల్లి ప్రైమరీ స్కూల్‌కు వెళ్లారు. ఆ సమయంలో విద్యా కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్‌ను నియమించుకుని పాఠశాలను నడిపించుకుంటామని అప్పటి జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉపాధ్యాయురాలు అనితను డిప్యూటేషన్‌పై పంపారు. స్థానికంగా ఉన్న పరిస్థితులతో ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయుడు రమేశ్ సైతం ఈనెల 23న మెడికల్ లీవ్ పెట్టారు. ఈ విషయమై ఎస్‌ఎంసీ చైర్మన్ బాబు ఎంఈవో శ్రీనివాస్ దీక్షితుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో, కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం తిరుపతి సోమవారం పాఠశాలలో సర్పంచ్ జలపతి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ విద్యాసంవత్సరం ముగిసే వరకు విభేదాలు లేకుండా పరిస్థితులను చక్కబెట్టుకోవాలని ఎస్‌ఎంసీ చైర్మన్‌ను కోరాడంతోపాటు ఉపాధ్యాయుడు రమేశ్‌ను మంగళవారం నుంచి విధుల్లో చేరాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- బాధితుల నుంచి 27 దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు తరలి వచ్చి కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార మార్గం చూపేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజావాణికి 25 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఇంచార్జీ డీఆర్వో శ్రీనివాస్‌రావు, పలు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి



వినతి పత్రం ఇస్తున్న చొక్కాల రాము

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ఆరోపించారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అన్నారు. ఈ విషయంపై నెల రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమ వెంచర్లు వేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

నా మనవన్ని హాస్టల్‌లో చేర్పించాలె



సురేష్‌తో కలెక్టరేట్‌కు వచ్చిన వెంకటలక్ష్మి

తన కూతురు లావణ్య ఏడాది క్రితం మృతిచెందిందని, మనవడు సురేష్ బాగోగులు చూడాల్సిన అల్లుడు మారుతి బాబుని వదిలేసి పోయాడని వృద్ధురాలైన వెంకటలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి, కన్నీరు పెట్టుకుంది. ప్రస్తుతం సురేష్ టెక్స్‌టైల్ పార్క్‌లో తన వద్దే ఉంటున్నాడని, ఇందిరమ్మ కాలనీలో 5వ తరగతి వరకు చదువుకున్నాడని తెలిపింది. తాను ఏ పనీ చేయలేనని, ఎలాంటి ఆధారం లేదని, ఎవరూ లేని తన మనువడిని హాస్టల్‌లో చేర్పించి, చదువు చెప్పించాలని వేడుకుంది.

ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వండి

- డీఎఫ్‌వోను కోరిన చందుర్తి నాయకులు



డీఎఫ్‌వో బాలమణికి వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి శివారు అటవీ ప్రాంతంలో గండి మైసమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం డీఎఫ్‌వో బాలమణిని కలిసి, వినతిపత్రం అందించారు. 50 ఏళ్ల క్రితం గండి మైసమ్మ తల్లిని నెలకొల్పారని, ప్రస్తుతం అక్కడ గుడి నిర్మించుకునేందుకు మల్యాల, చందుర్తి, రామన్నపేట గ్రామాల ప్రజలు నిధులు సమకూర్చుకొని, ముందుకు వస్తే ఫారెస్టు సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడి నిర్మాణం చేసుకునేందుకు 20 గుంటల స్థలం కేటాయించి, నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో చందుర్తి సింగిల్‌విండో చైర్మన్‌తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, ఉపసర్పంచ్ సిరం తిరుపతి, నాయకులు షిర్డీ మల్లేశం, పోతురాజు నగేశం, దేవుని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలు..

వీర్నపల్లి(సిరిసిల్ల): తరతరాలుగా పోడు భూముల సాగుపై ఆధారపడిన జిల్లాలోని గిరిజనులకు హక్కు పత్రాలివ్వాలని బీజేపీ దిశ కమిటీ జిల్లా సభ్యుడు, పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి బట్టు పీర్యా డిమాండ్ చేశారు. సోమవారం వీర్నపల్లి మండలంలోని బంజర్ల గ్రామంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా తెలంగాణ వ్యాప్తంగా పోడు భూములకు పట్టాలిస్తామంటూ ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. రైతులతో ప్రతీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని, పోడు భూముల హామీని తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించకపోతే రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నాణ్యత లేకుండా చెక్‌డ్యాంల నిర్మాణం

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు



మాట్లాడుతున్న వేణు

ఎల్లారెడ్డిపేట: అగ్రహారం, ఆవునూరు మధ్య చెక్‌డ్యాంలను నాణ్యత లేకుండా, అసంపూర్తిగా నిర్మించారని సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు ఆరోపించారు. సోమవారం వెంకటాపూర్, అగ్రహారం, ఆవునూరు చెక్‌డ్యాంలను ఆయన పరిశీలించారు. వాటికి పగుళ్లు ఏర్పడ్డాయని, నాసిరకం చెక్‌డ్యాంల వల్ల రైతులకు ఉపయోగం లేదని, వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని మండిపడ్డారు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని పేర్కొన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని, కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నాణ్యత లేని చెక్‌డ్యాంల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర మల్లేశం, మంత్రి చంద్రయ్య, జంగం అంజయ్య, రమేశ్, లక్ష్మణ్, నాగరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల నిబంధన సవరించాలి

వీర్నపల్లి(సిరిసిల్ల): ఒకటో తరగతి ప్రవేశాలకు ఆరేళ్ల నిబంధనలు సవరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతిజాదవ్ సోమవారం ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు ఆరేళ్లు నిండాలని రాష్ట్రాలకు లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ నిర్ణయంతో పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చేరే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

కోనరావుపేట(వేములవాడ): నిమ్మపెల్లికి చెందిన పెద్దిగారి నరేష్‌పై దాడి చేసిన లంబ ఎల్లయ్య, చేకూట తిరుపతి, అల్లెపు మల్లేశంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. శనివారం రాత్రి 9 గంటలకు సబ్‌స్టేషన్ ఆవరణలో ఎల్లయ్య, తిరుపతి, మల్లేశంలు కనిపించారు. ఇక్కడెందుకు ఉన్నారని నరేష్ వారిని ప్రశ్నించాడు. దీంతో మాటామాట పెరిగి, ఆ ముగ్గురు నరేష్‌పై కర్రతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమవారం పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

కరీంనగర్‌క్రైం: అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. నగరానికి చెందిన పి.కనుకయ్య హమాలీ పని చేసుకుంటూ జీవించేవాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉండగా వారిని వదిలేసి ఇక్కడ వేరే మహిళతో ఉంటున్నాడు. బీపీ, షుగర్ ఉండటంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు వేధించడంతో నిత్యం మద్యం తాగేవాడు. ఆదివారం సిక్‌వాడిలో కిందపడి ఉన్నాడు. అతడి కుటుంబ సభ్యులు వచ్చి చూడగా చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి వివరాలు.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన బత్తుల దేవేందర్ (40) ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవేందర్ సెంట్రింగ్ పని చేస్తుంటాడు. మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందినట్లు సోమవారం గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తార్కిక ఆలోచనలతోనే వికాసం

- సైన్స్‌తోనే సమాజంలో మార్పు
- ఎస్పీ అఖిల్ మహాజన్
- సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే విజ్ఞానశాస్త్రంపై అభిరుచి కలిగేలా ఉపాధ్యాయులు బోధించాలని, తార్కిక ఆలోచనలతోనే వికాసం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం సిరిసిల్లలోని జిల్లా గ్రంథాలయసంస్థ, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యదశ నుంచే వైజ్ఞానిక అభిరుచులు కలిగి ఉండేలా శిక్షణ ఇస్తే నూతన ఆవిష్కరణలకు నాంది పడుతుందన్నారు. మూఢవిశ్వాసాలపై ప్రశ్నించేతత్వం రావాలని కోరారు. విద్యార్థులు సామాజిక శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. సమాజంలో వస్తున్న మార్పులను గుర్తిస్తూ చైతన్యవంతమైన మార్గం వైపు నడిచేలా చూడాలన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, సైంటిఫిక్ ఎనలిస్ట్ వీఎస్‌ఎస్ మూర్తి, జాతీయ సలహాదారు టీపీ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, డాక్టర్ వంశీ, జేవీవీ జిల్లా అధ్యక్షుడు మీస రవి, జేవీవీ జిల్లా కార్యదర్శి గన్నమనేని శ్రీనివాసరావు, డీఎస్‌వో పాముల దేవయ్య పాల్గొన్నారు.

- జిల్లాలో సైన్స్ అధికారిగా పనిచేసి కరీంనగర్ జిల్లాకు బదిలీపై వెళ్లిన ఆంజనేయులను ఎస్పీ అఖిల్ మహాజన్ సన్మానించారు. విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించి, అవార్డు సాధించిన విషయాలను తెలుసుకున్నారు.

విధుల్లో చేరిన డీఈవో రమేశ్‌కుమార్



డీఈవో రమేశ్‌కుమార్‌కు పూలమొక్క అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



డీఈవోకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా నూతన విద్యాధికారిగా ఎలిమినేటి రమేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన డీఈవో రాధాకిషన్ మెదక్‌కు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. జిల్లాలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రమేశ్‌కుమార్ తెలిపారు. కార్యాలయ సిబ్బంది, వివిధ సంఘాల బాధ్యులు పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు. టీఎస్‌పీటీఏ బాధ్యులు విజయ్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.